www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 30 అక్టోబర్ 2023

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

పూర్వ విద్యార్థుల కుటుంబాలకు సాయం



సాయం అందజేస్తున్న 1994-95 బ్యాచ్ విద్యార్థులు

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

టేకి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో 1994–95 బ్యాచ్ పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులకు రూ.50 వేలు చొప్పున రూ2.50 లక్షలు ఆదివారం పలువురు ఆర్థిక సాయం అందజేశారు. పూర్వ విద్యార్థి ఎన్‌టిపిసి ఇంజినీర్ గుత్తుల వీరభద్ర రావు ఆధ్వర్యంలో పాఠశాలలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో వీటిని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాచ్ విద్యార్థులు వి.సుబ్రహ్మణ్యం, కె.వరప్రసాద్, పి.శ్రీనివాస్, వి.శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఉల్లి ఘాటు

సబ్సిడీపై రైతు బజార్లలో విక్రయించాలని కోరుతున్న వినియోగదారులు

మండపేట మెయిన్ బజారులో అమ్మకానికి సిద్దంగా ఉన్న ఉల్లి, కూరగాయలు

ప్రజాశక్తి-మండపేట

ఉల్లి ధర రోజురోజుకూ ఘాటెక్కుతోంది. ఉల్లిపాయలు కోయకుండానే కన్నీరు తెప్పిస్తున్నాయి. నిన్న, మొన్నటివరకు మార్కెట్లో కిలో రూ.30 నుంచి 35 ఉన్న ఉల్లిపాయల ధర నేడు రూ.80 నుంచి రూ.90కి చేరుకుంది. పెరిగిన ధరల నేపథ్యంలో స్థానిక రైతు బజారులో ఉల్లి ధర రూ.48గా బోర్డు పెట్టడంతో వాటిని కొనేందుకు ప్రజలు క్యూ కడుతున్నారు. శుక్రవారం, శని, ఆది వారాల్లో రైతు బజార్లో సుమారు 70 బస్తాల ఉల్లిపాయలు అమ్మినట్లు ఎస్టేట్ అధికారి చెబుతున్నారు. నాణ్యతను బట్టి రిటైల్ లో కిలో రూ.80 నుంచి రూ.90 వరకు విక్రయిస్తున్నారు. ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో సెంచరీకి చేరువవుతుందని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఉల్లి సాగు తగ్గడంతో పాటు వర్షాలు లేక పంట ఎండిపోవడం దిగుబడిపై ప్రభావం చూపుతుంది. అంతేకాకుండా మరో పదిరోజుల్లో కొత్త పంట చేతికి రానున్న నేపథ్యంలో ధరల్లో ఈ వ్యత్యాసం ఉంటుందని పలువురు వ్యాపారులు అంటున్నారు. ఉల్లి ధర రైతు బజార్లలో ఏలా ఉన్నా బహిరంగ మార్కెట్లో కిలో రూ.90 పైమాటే పలుకుతుండటంతో మరోవైపు ఘాటెక్కిన ధరతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. ఉల్లి పండించే మహారాష్ట్రతో పాటు మన రాష్ట్రంలోని కర్నూలులో దిగుబడులు తగ్గుముఖం పట్టడం కూడా ఒక కారణమని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో హోటళ్ల నిర్వాహకులు దోసెలు, ఇతర వంటకాల్లో ఉల్లికి బదులు క్యాబేజీ వినియోగిస్తున్నారు. కార్తిక మాసం ప్రారంభం నాటికైనా ధర తగ్గుతుందో, లేదోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఉల్లి నిల్వలను కొంతమంది వ్యాపారులు బ్లాక్ మార్కెట్కు తరలించి గోదాముల్లో దాస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం దృష్టి సారించి రైతుబజార్లలో సబ్సిడీపై ఉల్లి విక్రయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇప్పటికే అల్లం ధర రైతు బజార్ లో రూ.130, బహిరంగ మార్కెట్లో రూ.140 నుంచి 150 వరకు పలుకుతుండడం విశేషం. చిక్కుడు సెంచరీకి చేరువలో ఉండగా వంకాయలు, క్యారెట్, గోరుచిక్కుళ్లు అర్థ సెంచరీకి దగ్గరగా ఉన్నాయి. దీంతో ఏమి తినాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి ధరలను అందుబాటులో ఉండేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కొద్దిరోజుల్లో కొత్త పంట

ఈ విషయంపై స్థానిక రైతు బజార్ ఎస్టేట్ అధికారి బి.సతీష్ కుమార్‌ను వివరణ కోరగా మరో 10 రోజుల్లో కొత్త పంట చేతికి రానున్న నేపథ్యంలో ధరలలో ఈ వ్యత్యాసం ఉంటుందన్నారు.

ఏమితినాలో తెలియని పరిస్థితి

ఉల్లిపాయల ధరతోపాటు అన్ని సరుకుల ధరలు సామాన్యులకు అందని రీతిలో పెరిగిపోతున్నాయి. దీంతో ఏమితినాలో తెలియని పరిస్థితి నెలకొంది. వంకాయ, గోరుచిక్కుళ్లు, క్యారెట్ ధరలు ఆకాన్ని అంటుతున్నాయి.

-కె.ఈశ్వరి, గృహిణి, మండపేట

కూరగాయల ధరలు అదుపులో ఉంచాలి

సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం కూరగాయల ధరలను అదుపులో ఉంచాలి. ఉల్లిపాయలు ధరతోపాటు చిక్కుడు, అన్ని కూరలలో విడివిడిగా వాడే అల్లం ధర ఆకాన్నంటుతోంది.

-రామలక్ష్మి, గృహిణి, మండపేట

సహకార సంఘాల ప్రయివేటీకరణను విరమించుకోవాలి

ప్రజాశక్తి - అమలాపురం

సహకార సంఘాల ప్రయివేటీకరణను విరమించుకోవాలని ఎపి స్టేట్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు టి.వెంకట్రామయ్య, ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, కోశాధికారి పి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులు ఎలాంటి కృషి చేయట్లేదన్నారు. పలుమార్లు కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 30న గుంటూరులోని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. దీన్ని విజయవంతం చేయాలని ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లోని పిఎసిఎస్‌లలతో రైతులు ఆత్మీయ వాతావరణంలో ఉండాలన్నారు. కాని పిఎసిఎస్‌లో 50 శాతం వాటాలను ప్రయివేటు వ్యక్తులు, కంపెనీలకు ఇస్తూ 1964 చట్టానికి చేసిన సవరణను రద్దు చేయాలన్నారు. రైతులు మాత్రమే సంఘాల్లో యజమానులుగా ఉండాలన్నారు. జిఒ 36, 90 ప్రకారం వేతనాలను అమలు చేయాలన్నారు. 2016 ఏప్రిల్ 1 నుంచి మోనటరీ బెనిఫిట్స్ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యూటీలను చట్టప్రకారం అమలు చేయాలన్నారు. రాష్ట్ర సహకార బ్యాంకు, జిల్లా సహకార బ్యాంకుల కలిసి డిస్ట్రిక్ట్ లెవెల్ సపోర్టు ఫండు ఏర్పాటు చేయాలన్నారు. హెచ్ఆర్ పాలసీని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు గతంలో మాదిరిగా ప్రభుత్వం, బ్యాంకులు, సంఘాలు కలిపి క్యాడర్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్థిక ప్రయోజనాలను చేకూర్చిన తర్వాత మాత్రమే బదిలీలు చేయాలని అన్నారు. ప్రస్తుతం ఎస్‌ఎంఎస్, డివిజేషన్లు ఇస్తున్న బదిలీల ప్రక్రియను వెంటనే నిలిపేయాలని అన్నారు. జిఒ 36లో పేర్కొన్నట్టు డిఎ పద్ధతిని మాత్రమే అనుసరించి అప్పాల్ మార్గదర్శకాలు ఇచ్చిన 24.90 శాతాన్ని వెంటనే సవరించాలన్నారు. 2019 ఏప్రిల్ 1 నాటి వేతన సవరణ చేయాలన్నారు. జిఒ 36లో పేర్కొన్న ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. డ్యూటీలను రద్దు చేయాలన్నారు. సహకార సంఘాల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, 2019 మార్చి తరువాత సహకార సంఘాల్లో నియామకమైన సిబ్బందిని వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ ఇచ్చిన ఆదేశాల మేరకు సంఘాల పేరు ధనంపై 6 శాతం డివిడెండ్ లేదా వడ్డీని తక్షణమే డిసిసిబిలు పిఎసిఎస్‌లకు చెల్లించేలా ఆదేశాలను జారీ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం చేపట్టే రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

కల్యాణ మండపం పనులకు శంకుస్థాపన

కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ సతీష్‌కుమార్, తదితరులు

ప్రజాశక్తి-ఐ.పోలవరం

ఐ.పోలవరం గ్రామ పంచాయతీ పరిధిలో బాణాపురం గ్రామంలో ఉన్న సత్తెమ్మ తల్లి గుడి దగ్గరలో కళ్యాణ మండపం పనులకు ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఆదివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ దంతులూరి రాఘవరాజు ఆధ్వర్యంలో ఎం.పి.పి.మోర్త రాణి మిరియం జ్యోతి సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ మాట్లాడుతూ రాష్ట్ర వైసిపి నాయకులు కీర్తి శేషులు భూపతి రాజు సుదర్శన్ బాబు వున్నప్పుడు రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ ను కళ్యాణ మండపం పనులు కోసం నిధులను మంజూరు చేయమని అడిగారన్నారు. ఆ విషయాన్ని ఎంపీ బోస్ గుర్తుపెట్టుకొని సుదర్శన్ బాబు కోరిక మేరకు రూ.25లక్షలు నిధులను మంజూరు చేశారన్నారు. ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. ఈ కల్యాణ మండపం త్వరగా పూర్తి చేయాలని, ఈ కల్యాణమండపానికి సుదర్శనబాబు పేరు పెడతామని అన్నారు. సుదర్శన బాబు సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో వై.సి.పి.రాష్ట్ర నాయకులు కోరుకొండ సత్యనారాయణ, మండల అధ్యక్షులు పిన్నమరాజు వెంకట పతిరాజు, జిల్లా జనరల్ సెక్రటరీ మోకా రవి కుమార్, సొసైటీ ఛైర్‌పర్సన్ విత్తనాల శ్రీనివాసరరావు, ధూళిపూడి చక్రం, వైస్ ఎంపిపితోట మాణిక్యాలరావు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన (జగనన్నకు చెబు దాం) కార్యక్రమం ఈనెల 30 వ తేదీ సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ స్పందన హాల్లో ఉదయం 10 గంటల నుంచి యథా విధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ హి మాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాస్థాయి సమస్యలను జిల్లా యంత్రాంగం, దష్టికి తీసుకొని వచ్చి తగు పరిష్కార మార్గాలు పొందా లని ఆ ప్రకటనలో అర్జీదారులకు జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి-మండపేట

స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 30వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సమావేశంలో చర్చించబోయే అంశాల అజెండాను విడుదల ఆమె చేశారు.

'గూడపాటి' కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన గూడపాటి నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ తదితరులు గూడపాటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగేశ్వరరావు మృతి తీరని లోటని కుటుంబ సభ్యులను అన్ని విధాల ఆదుకుంటామని ఆయన అన్నారు. ఈయన వెంట కొత్తపేట ఆర్‌డిఒ ముక్కంటి, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు కప్పల శ్రీధర్ తదితరులు ఉన్నారు.

'నూర్‌బాష్' సింహగర్జనకు తరలిన ముస్లిములు

ప్రజాశక్తి-మండపేట

ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహిస్తున్న రాష్ట్ర నూర్ బాష్, దూదేకుల ముస్లిం సింహగర్జనకు జిల్లా నలుమూల నుంచి ముస్లింలు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జిల్లా నూర్ బాష్ సంఘం అధ్యక్షులు షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయం పార్టీలు నూర్ బాష్, దూదేకుల ముస్లిం కులస్తులకు చట్ట సభలో తగిన ప్రాధాన్యం కల్పించుట, మైనార్టీ పదవులలో వర్గీకరణ నూర్ బాష్, దూదేకుల ముస్లిం కులస్తులకు పదవులు బడ్జెట్ తప్పనిసరిగా కేటాయించడం, ఏ రాజకీయ పార్టీ అయితే తమకు సముచిత స్థానం కల్పిస్తుందో ఆ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామన్నారు. అనంతరం ప్రత్యేక బస్సుల్లో సింహగర్జనకు తరలి వెళ్లారు

కార్టూ'నిజం'



'పివిఆర్' హైస్కూల్ యాజమాన్య వైఖరికి నిరసన

మద్దతు తెలిపిన పలువురు నాయకులు

ద్రాక్షారామలో ప్రారంభమైన నిరసన దీక్షలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రెండేళ్లుగా వివాదాస్పదంగా మారిన ద్రాక్షారామ పివిఆర్ హైస్కూల్ యాజమాన్య విధానాలపై ఆదివారం ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్ పక్కన నిరసన దీక్షలు చేపట్టారు. రాష్ట్ర వైసిపి న్యాయ విభాగం నాయకులు మాగాపు అమ్మిరాజు ఆధ్వర్యంలో ప్రారంభమైన నిరసన దీక్షలకు పలువురు మద్దతు తెలిపారు. దీక్షా శిబిరంలో మాగాపు అమ్మిరాజు మాట్లాడుతూ రెండేళ్లుగా మూసివేసిన పివిఆర్ హైస్కూల్ యాజమాన్యం పైండా సత్య ప్రసాద్, అతని కుమారుడు ఇక్కడ సుమారు రూ.70 కోట్ల విలువైన ఆస్తులను నాలుగు ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. విద్యార్థుల్లో చదువు కోసం దాతలు దానంగా ఇచ్చిన ఈ భూమిని ఆస్తులను తమ స్వప్రయోజనాలకు కల్యాణ మండపాలు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించుకోవాలని దురుద్దేశంతో హైస్కూల్ మూసివేశారన్నారు. తిరిగి తెరుస్తామని ప్రకటించినా దాన్ని అమలు చేయలేదని పైగా లేనిపోని కేసులు పెట్టి 13 మందిని వేధిస్తున్నారన్నారు. వీటన్నింటిపై న్యాయపోరాటం చేస్తామన్నారు. కార్యక్రమానికి మద్దతునిచ్చిన వైసిపి నాయకులు పిల్లి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ పివిఆర్ హైస్కూల్ యాజమాన్యం దాత ఇచ్చిన భూములను హైస్కూల్ను సదుద్దేశంతో ఇక్కడ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. టిడిపి ఇన్చార్జ్ రెడ్డి సుబ్రమణ్యంనిరసనకారులకు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు శంకర్ నారాయణ, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్, మాజీ జెడ్పిటిసి సభ్యులు ఇంతసంతోషం, మాజీ జెడ్పి వైస్ ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, చోడిశెట్టి శివాజీ, నామ వెంకన్న బాబు, కొప్పిశెట్టి శ్రీనివాసు, ఆళ్ల బుజ్జి, రావూరి సుబ్బారావు ద్రాక్షారామ, అన్నాయి పేట, వేలం పాలెం, తోటపేట, వేగాయమ్మ పేట, హసన్ బాధ, ఉండూరు, రామచంద్రపురం, తదితర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు ఆటో యూనియన్ నాయకులు నిరసన దీక్షకు మద్దతు తెలిపారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక

అప్పటి గురువులను సత్కరిస్తున్న చెముడలంక జెడ్‌పి ఉన్నతపాఠశాల పూర్వవిద్యార్థులు

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని చెముడులంక ఎస్‌టిఎస్‌ఎన్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 1977 నుంచి 1982 సంవత్సరం వరకు చదివిన పూర్వ వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆరు నుంచి పదవ తరగతి వరకు ఐదేళ్ల పాటు ఈ పాఠాల్లో పూర్వ విద్యార్థులంతా కలిసి చదువుకున్నారు. సుమారు 47 మంది మిత్రుల్లో ఇన్నేళ్ల తర్వాత 40 మంది కుటుంబ సభ్యులతో వచ్చి ఆ'పాత' మధురాలను గుర్తుకుతెచ్చుకున్నారు. తమ గురువులను సత్కరించారు. ఇటీవల కాలంలో అకాలంగా మతి చెందిన సహచరులకు శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించారు. సమాజంలో ఆదర్శవంతమైన వ్యక్తులుగా జీవించి విద్య నేర్చుకున్న పాఠశాలకు, నేర్పిన గురువులకు, పెరిగిన ప్రాంతానికి మంచి పేరు తెచ్చిపెట్టాలని విశ్రాంతి ఉపాధ్యాయులు సూచించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో సత్కారం పొందిన రామలింగేశ్వరరావు మాస్టారు (సైన్స్, లెక్కలు), కీర్తి రామం మాస్టారు (సోషల్ స్టడీస్), గన్ని ప్రసాద్ మాస్టర్ (ప్రధానోపాధ్యాయులు) తమ స్పందనను తెలిపారు. పూర్వ విద్యార్థుల కలయిక కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా ప్రజాహిత కార్యక్రమాలకు ఒకరికొకరు సహకరించుకునే విధంగా చేయూత నివ్వాలని పూర్వ విద్యార్థులు అన్నారు. ఎవ్వరికీ ఎలాంటి అవసరం వచ్చినా అందరం కలిసి భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఏటా కలుసుకుంటూ కష్టసుఖాలను పంచుకుంటూ పాఠశాల అభివృద్ధికి, మన తోటి సహచరులకు అవసరమైన సహాయ సహకారాలు అందించే ప్రయత్నం చేయాలని వారంతా ఆకాంక్షించారు.

టిడిపితోనే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తు

పుల్లేటికుర్రులో సమావేశంలో పాల్గొన్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-అంబాజీపేట

టిడిపి ప్రభుత్వంలోనే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎంపిపి సత్యనారాయణ అన్నారు. పుల్లేటికుర్రులో ఆదివారం ఆయన స్వగృహం వద్ద బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమానికి సంబంధించిన కార్యక్రమంలో భాగంగా జరిగిన బూత్ కన్వీనర్లు, బూత్ ఇన్‌చార్జులు మరియు కార్యకర్తలు సమావేశానికి సత్యనారాయణ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 1వ తేదీ నంచి ప్రజలలోకి వెళ్లి టిడిపి ప్రభుత్వ హయాంలో వచ్చే ఎన్నికల మేనిఫెస్టో ప్రతి ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. ఒక గ్యారెంటీ పత్రం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, యనమదల రాజబాబు, పెదపూడి శ్రీనివాస్, దొమ్మేటి శ్రీనివాస్, యూనిట్ ఇన్‌చార్జ్ డి.శ్రీనివాసరావు, ఐటిడిపి నాగేంద్ర, కె.వీరవెంకట సత్యనారాయణ, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనుల్లో నాణ్యతా లోపాలు

కానరాని అధికారుల పర్యవేక్షణ

స్థానికుల ఆరోపణ

డ్రైనేజీ అడుగుభాగాన పనులు ఇలా.. (ఇన్‌సెట్) సైడ్ వాల్ నిర్మాణం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని తాటిపూడి గ్రామం పాలెంలో గడప..గడపకూ కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో చేస్తున్న డ్రైనేజీ పనుల్లో నాణ్యత లోపిస్తోంది గుత్తేదారు ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నా ఏ ఒక్క అధికారి పరివేక్షించిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. పది కాలాలపాటు ప్రతిష్ఠంగా ఉండవలసిన ఏ డ్రైనేజీ ఇష్టానుసారంగా పనులు చేస్తుంటే ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదంటూ పాలెంవాసులు అంటున్నారు. వివరాల్లోకెళ్తే ఇటీవల గడప..గడపకూ కార్యక్రమం చేపట్టిన స్థానిక ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డికి తాడిపూడి పాలెం వాసులు డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్నామంటూ ఆయనకు మొరపెట్టుకున్నారు. దీంతో ఆయన ఆర్డబ్ల్యూఎస్ అధికారులను అంచనా వేసి పనులు చేపట్టాలని రూ.15 లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో ఇంజినీరింగ్ అధికారులు స్థానిక గుత్తేదారుకు లబ్ధి చేకూర్చడానికి టెండర్లు పిలవకుండా గ్రామపంచాయతీ ద్వారా తీర్మానం చేపించి ఆ పనులను స్థానిక కట్టబెట్టారు. దీంతో వ్యక్తి ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారు. డ్రైనేజీ నిర్మాణం జరిగేటప్పుడు అడుగు భాగాన 6 అంగుళాలు కాంక్రీట్ పనులు చేపట్టాల్సి ఉండగా అడుగుభాగాన ఇసుక ఫిల్లింగ్ చేయకుండానే కేవలం 4 అంగుళాలు మాత్రమే కాంక్రీట్ పనులు ఇష్టాను సారంగా చేపట్టారు.

సైడ్ వాలు పనుల్లో ఒక బస్తా సిమెంటు,1.5 బస్తాలు ఇసుక, మూడు బస్తాల కంకర వేసి కాంక్రీట్ పనులు చేపట్టాలి. కానీ ఇక్కడ పనులు అలా జరగడం లేదు. గుత్తేదారు ఇష్టానుసారంగా సైడ్‌వాల్ నిర్మాణం పనులు చేపడుతుంటే ఇదేమిటిని అడిగే నాథుడే కరువయ్యాడు. పనులు చేసే సమయంలో ఇంజినీరింగ్ సిబ్బంది పర్యవేక్షించిన దాఖలాలు లేవని ఇక్కడివారు పేర్కొంటున్నారు. రాజవరం పొదలాడ ఆర్అండ్‌బి రోడ్డు చింతనే డ్రైనేజీ ఉండడంతో ఇసుక లారీలు దాటికి కూలిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు కలగజేసుకుని డ్రైనేజీ నిర్మాణం పది కాలాల పాటు ప్రతిష్ఠంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇక్కడ వాసులు కోరుకుంటున్నారు.

పలుచోట్ల అన్నసమారాధనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా జిల్లాలో పలుచోట్ల ఆదివారం అన్నసమారాధనలు నిర్వహించారు.

కపిలేశ్వరపురం మండలంలోని తాతపూడి పుష్కర్ ఘాట్ వద్ద కొలువై ఉన్న విజయ దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన భారీ అన్న సమారాధనలో ఆదివారం ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొన్న ఎంఎల్‌సి తోట ను తాతపూడి శెట్టి బలిజ సంఘం పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గూటం సత్యనారాయణ, కొప్పిశెట్టి శ్రీనివాస్ ,మేడిశెట్టి దుర్గారావు, మాజీ సర్పంచ్ వెన్నెటి సత్యనారాయణ, శెట్టిబలిజ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట విజయదశమి పురస్కరించుకుని మండల పరిధిలోని పలు దేవాలయాలలో అన్నసమారాధనలు నిర్వహించారు. కొత్తపేట శిరిడి సాయిబాబా ఆలయం నందు , అవిడి మార్కెట్ వీధిలో రాకుర్తి వారి పాలెంలో జరిగిన అన్నసమారాధనల్లో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. సోమవారం మోడేకుర్రు గ్రామంలో అన్న సమాధాన నిర్మిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపాం

కళ్లకు గంతలు కట్టుకుని టిడిపి నాయకుల నిరసన

కళ్లకు గంతలు కట్టుకుని మండపేట ఎంఎల్ఎ నిరసన

ఉప్పలగుప్తంలో ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కళ్లు తెరిపిద్దాం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వివరాలు ఇవి..

మండపేట చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మండపేటలో ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో కళ్లు తెరిపిద్దాం కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం నిర్వహించారు. స్థానిక రథం సెంటర్ లో ఆయన కళ్లకు గంతలు కట్టుకుని నిజం గెలవాలి అంటూ నినాదాలు చేశారు. చంద్రబాబుకు మద్దతుగా 5 నిమిషాల పాటు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు 45 ఏళ్లుగా తన జీవితాన్ని తెలుగువారి అభ్యున్నతికి, ఆంధ్రప్రదేశ్ ప్రగతికి దారపోసిన మచ్చలేని గొప్పనేత అని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోను టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కళ్లకు గంతలు కట్టుకుని నిజం గెలవాలి అంటూ నినాదాలు చేసి తమ నిరసనలను తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తపేట రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు కొత్తపేట నియోజకవర్గ బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ఆదివారం రాత్రి 7 గంటల నుంచి 7:05 గంటల వరకు, (ఐదు నిమిషాల పాటు) కళ్ళకు గంతలు కట్టుకుందాం వాకిళ్ళ, బాల్కనీలు, వీధుల్లోకి వచ్చి చంద్రబాబుగారికి మద్దతుగా 'నిజం గెలవాలి' అని నినాదాలు చేస్తూ మద్దతు పలికారు. కార్యక్రమంలో బిళ్ళకుర్రు గ్రామ పార్టీ అధ్యక్షుడు వాకాడ శేష గోవిందరావు, ఎలిశెట్టి రామకష్ణ, పంచాయతీ వార్డు సభ్యులు కొండేపూడి గోవిందరావు వాకాడ సత్యానందరావు, కొండేపూడి శ్రీరాములు, గొల్ల కోటి శ్రీరాములు వాకాడ శ్రీనివాసరావు అంద్రోతు రాంబాబు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం టిడిపి మండల అధ్యక్షుడు ఆరిగెల నానాజీ ఆధ్వర్యంలో ఉప్పలగుప్తంలో కళ్లు తెరిపిద్దాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయ కులు చిక్కం పెద్దబ్బులు, రవణం మధు, గాలి దేవర సురేష్, సలాది శ్రీనివాసరావు, చీకట్ల ఏసుబాబు, గాలిదేవర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయ కమిటీ సమావేశం

టిడిపి-జనసేన సమావేశంలో కొత్తపేట నాయకులు

ప్రజాశక్తి-కొత్తపేట

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టిడిపి, జనసేన సమన్వయ కమిటీ సమావేశం కాకినాడలో ఆదివారం జరిగింది. సమావేశంలో కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి బండారు శ్రీనివాస్, రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి సుబ్రమణ్యం, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, జనసేన, టిడిపి రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జిలు, పట్టణాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, పార్టీ మహిళ నాయకురాలు, పాల్గొన్నారు. సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ పై చర్చించారు.

నేరాలు ఘోరాలు

బైకును లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-దేవరపల్లి

బైకును లారీ ఢీకొని ఒక మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం దేవరపల్లి-గోపాలపురం హైవేలో చోటు చేసకుంది. బైకుపై వెళుతున్న భార్యా భర్తలను గొల్లగూడెం గ్రామం వికలాంగుల ఆశ్రమం సమీపంలో ఒక లారీ వెనుక నుంచి ఢీకొట్టగా ఇద్దరూ కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో దిర్శిపాము నాగవేణి (45) అక్కడికక్కడే మృతి చెందింది. భర్త యేసయ్య గాయపడగా గోపాలపురం ఆసుపత్రికి తరలించారు. ఆయన ఇచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు

వ్యాన్ ఢీకొని కార్మికుడు మరణం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వ్యాను ఢీకొని కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వలసపాకల గ్రామంలో ఆదివారం చోటు చేసుకొంది. పోలీసులు అందించిన సమాచారం మేరకు.. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ పరిశ్రమ క్యాంటీన్‌లో పి.దుర్గ (28) దినసరి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. డ్యూటీ నిమిత్తం తెల్లవారుజామున 5 గంటల 45 నిముషాల బయలుదేరిన దుర్గ వలసపాకల బ్రాందీ షాప్ సెంటర్‌కు చేరుకొనేసరికి పోర్టుకు ఐస్ లోడుతో వెళుతున్న వ్యాన్ వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు తగలడంతో దుర్గ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలి

కార్మికుని కుటుంబాన్ని కంపెనీ, ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది. డ్యూటీ టైంలో గంట ముందు డ్యూటీ దిగిన తరువాత గంటలోపు కార్మికునికి ఏమి జరిగినా కంపెనీ బాధ్యత వహించాలన్నారు. కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు.

కె.పద్మశ్రీవల్లి

సిహెచ్.కృష్ణ

రాష్ట్ర స్థాయి గేమ్స్‌కు 'ప్రతిభ' విద్యార్థులు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

తమ విద్యార్థులు విద్యలోనే కాక ఆటల్లో కూడా సత్తా చాటారని సామర్లకోట ప్రతిభ విద్యా నికేతన్ హైస్కూల్ డైరెక్టర్ ఎస్‌వివిజి.ప్రకాష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం కాకినాడలో నిర్వహించిన అండర్ 17 ఖోఖో స్కూల్ గేమ్స్‌లో తమ పాఠశాల విద్యార్థులు సిహెచ్.కృష్ణ (9వ తరగతి), కె.పద్మ శ్రీవల్లి (8వ తరగతి) విజయం సాధించి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల ద్వారా శారీరక, మానసిక వికాసం, అభివృద్ధి జరిగి పిల్లలలో నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయన్నారు. విజయం సాధించిన విద్యార్థులను ఆయనతోపాటు ప్రిన్సిపల్ టి సునీత. వైస్ ప్రిన్సిపల్ పి.గౌరి విద్యార్థులను అభినందించారు.

ఆట వస్తువుల పంపిణీ

ప్రజాశక్తి-నల్లజర్ల

యువత చెడు వ్యసనాలకు జోలికి పోకుండా విద్యలోనూ క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని వైసిపి నాయకులు మద్దిపాటి ప్రసాద్ అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో క్రీడలను ప్రోత్సహిస్తూ యువతకు వాలీబాల్, నెట్, వంటి ఆట వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

200 మందికి కంటి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం దూబచర్ల శ్రీ సంఘమిత్ర విద్యాలయలో లయన్స్ క్లబ్, పార్ద్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 200 మందికి వైద్య సేవలు అందించారు. వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని చేపట్టామని క్యాంప్ ఆర్గనైజర్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిబిరంలో 20 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం వేమగిరి కంటి ఆసుపత్రికి పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కెల్లా వాసు, దూబచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.రత్నం, కూచిపూడి ఉదయభాస్కరరావు, ఆచంట సత్యనారాయణ, దూబగుంట్ల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సతీష్ బాబు మాస్టారును సన్మానిస్తున్న ఎంఎల్‌సి కుంభ రవిబాబు

సతీష్‌బాబుకు భీమ్ వీర్ పురస్కారం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కన్నూరి సతీష్‌బాబుకు ఆలిండియా షెడ్యూల్ ట్రైబ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమ్ వీర్ పురస్కారం అందించింది. సతీష్‌బాబు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా అందించిన సేవలకు గాను దీన్ని అందించారు. ఎంఎల్‌సి కుంభ రవిబాబు చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఆదివారం ఏలూరు జిల్లా ఏలూరులో ఆల్ ఇండియా షెడ్యూల్ ట్రైబ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ పురస్కారాన్ని అందించారు. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పురస్కార గ్రహీత సతీష్‌బాబుకు పలువురు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

ప్రజాశక్తితో డిఇఒ కమల కుమారి

ముఖాముఖి



ప్రజాశక్తి-అమలాపురం

నాడు-నేడు పనులతో అనేక స్కూళ్లలో రూపురేఖలు మారిపోతున్నాయి. సమస్యలు సమసి సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి. విద్యా కానుక పంపిణీ ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో రోజురోజుకూ భరోసా పెరుగుతుంది. ఫీజుల భారం భరించలేక జిల్లావ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సర్కారు బడుల్లో చేరుతున్నారు. అమ్మఒడి వంటి మహత్తర పథకాలు పేద పిల్లలకు మంచి అవకాశం అని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖ అధికారి కమల కుమారి అన్నారు. పలు అంశాలను ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

రెండో విడత నాడు-నేడు పనులు ఎంతవరకు వచ్చాయి.

జిల్లాలో రెండో దశలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు అభివృద్ధి పనులతో సమూల మార్పులు జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావడానికి నాడు-నేడు ఎంతగానో తోడ్పడుతోంది. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అన్ని వసతులు కల్పిస్తున్నాం. రెండో విడతలో జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో పనులు చేయాలని ప్రాతిపాదించి మొదలు పెట్టారు.పనులు జరుగుతున్నాయి. త్వరలోనే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఏయే వసతులు కల్పిస్తున్నారు.

పిల్లలకు అవసరమైన వసతులన్నీ సమకూరుస్తున్నాం. మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, ఆట వస్తువులు, సైకిల్ షెడ్లు, తాగునీరు, బెంచీలు, గ్రీన్ బోర్డులు, ఫ్లోరింగ్ టైల్స్, మొక్కలు, ప్రతి పాఠశాలకు స్మార్ట్ టీవీ సమకూరుస్తున్నారు. భవిష్యత్తులో పిల్లలు బాధ్యతగా మెలిగేందుకు పాఠశాల విద్యా కమిటీల్లో వారిని భాగస్వామ్యం చేసేలా చేస్తున్నారు. ఉపాధ్యాయుల కమిటీలను కూడా త్వరలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

విలీనంపై పలు చోట్ల తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారు.

విలీనంపై ఎక్కడైనా అభ్యంతరాలు వ్యక్తం అవుతున్న ప్రాంతాల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఒక కిలో మీటరు లోపులో ఉన్న ప్రాథమిక పాఠశాలలను మాత్రమే విలీనం చేస్తున్నాం. హైస్కూళ్లలో సౌకర్యాల మెరుగు కోసం కృషి చేస్తున్నాం.

విద్యా కానుక కిట్లులో ఏమి అంస్తున్నారు.

జగనన్న విద్యా కానుక కిట్లలో మూడు జతల యూనిఫామ్స్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, ఒక సెట్ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్ వంటివి ఉంటాయి. అలాగే బాలురకు స్కై బ్లూ రంగు, బాలికలకు నేవీ బ్లూ రంగు బ్యాగులు అందించాము.

పాఠశాలల్లో పర్యవేక్షణ ఎలా ఉంది.

అధికారులు విధిగా పాఠశాలలకు వెళ్లి పర్యవేక్షించాల్సిందే. అక్కడ లోటుపాట్లను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలి. జాబ్ చార్టు ప్రకారం పాఠశాలలు తనిఖీ చేసి ఉన్నతాధికారులకు నివేదించాలి. ఇప్పటికే జిల్లా, ఉప, మండల విద్యాశాఖాధికారులు, సెక్టోరియల్ అధికారులు తప్పక పర్యవేక్షించాలని ఆదేశించాం. నిర్లక్ష్యం చేసిన వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటాం.

నో స్కూల్ బ్యాగ్ డే ఎలా అమలవుతోంది.

ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు వారంలో ఒక రోజు అయినా చిన్నారులకు పుస్తకాలు మోసే బరువును తగ్గించాలని ప్రభుత్వం భావించింది. అందుకే నో స్కూల్ బ్యాగ్ డే విధానంలో భాగంగా నెలలో మొదటి, మూడు శనివారాల్లో స్కూల్‌కు చిన్నారులు బ్యాగ్ లేకుండా వెళ్ళాలని ప్రభుత్వం నిర్ణయించి అన్ని విద్యాసంస్థలకు ఆదేశాలను కూడా జారీ చేసింది.

ప్రభుత్వాన్ని గద్దె దించడమే టిడిపి, జనసేన లక్ష్యం

ప్రజాశక్తి-కాకినాడ

వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా టిడిపి జనసేన ఉమ్మడి కార్యాచరణతో పని చేస్తామని టిడిపి, జనసేనఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సమావేశంలో ఉభయ పార్టీల నాయకులు స్పష్టం చేశారు. టిడిపి జిల్లా సమన్వయకర్త కొల్లు రవీంద్ర, జనసేన పార్టీ జిల్లా సమన్వయకర్త రవిశంకర్ అధ్యక్షతన ఆదివారం కాకినాడలో సమావేశం నిర్వహించారు. టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టును సమావేశం తీవ్రంగా ఖండించింది. అనంతరం ఉభయ పార్టీల సమన్వయ కమిటీ నాయకులు మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనపై ఉమ్మడి పోరాటమే అంతిమ లక్ష్యంగా జనసేన టిడిపి నాయకులు కార్యకర్తలు కలిసి పోరాటం చేస్తామన్నారు. తమ నాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం అన్నారు. వైసిపి అరాచక పాలనతో అన్ని వర్గాల ప్రజలూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు అభివృద్ధి అనేది రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. వైసిపి మంత్రుల దగ్గర నుంచి నాయకుల వరకు అందరూ ఇసుక, మట్టి, మద్యంతో రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్నారన్నారు. టిడిపి జనసేన కలయికపై ఎన్ని కుతంత్రాలు పన్నినా జాగ్రత్త వహించాలన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం టిడిపి, జనసేన సమన్వయంతో పని చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, కెఎస్.జవహర్, పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, రాష్ట్ర పరిశీలకులు శివశంకర్, పిఎసి సభ్యులు ముత్తా శశిధర్, పితాని బాలకృష్ణ, పంతం నానాజీ, శెట్టిబత్తుల రాజబాబు, టిడిపి జోన్-2 సమన్వయకర్త మందలపు రవికుమార్, మాజీ మంత్రులు చిక్కాల రామచంద్రరావు, గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎంఎల్ఎలు జ్యోతుల నెహ్రూ, వనమాడి వెంకటేశ్వరరావు, ఎస్‌విఎస్ఎన్.వర్మ, అయితాబత్తుల ఆనందరావు, దాట్ల బుచ్చిబాబు, పిల్లి అనంతలక్ష్మి, చిల్లా జగదీశ్వరి, చెల్లి వివేకానంద, మాజీ ఎంఎల్‌సి రెడ్డి సుబ్రహ్మణ్యం, అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఉభయ పార్టీల నాయకులు

దాడిపై ఆర్‌టిసి డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ఉదయం 6.30 గంటలకు కొవ్వూరు ఆర్‌టిసి డిపో వద్ద ఆర్‌టిసి డ్రైవర్లు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ నెల 26న కావలిలో ఆర్‌టిసి డ్రైవర్ రాజాసింగ్‌పై దుండగులు చేసిన దాడిని ఖండించి నిరసన తెలిపారు. రాజాసింగ్‌పై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎంవి.రావు, రీజినల్ అధ్యక్షులు టివి.రాజు పాల్గొన్నారు.

పేదలకు 'మల్లిపూడి' సాయం

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

కొవ్వూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మల్లిపూడి ట్రస్ట్ తరుపున పేదలకు ప్రతి నెలా కిరాణా, బియ్యం, పెన్షన్, న్యాయ సాయం, వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందిస్తామని ట్రస్ట్ ప్రతినిధి మల్లిపూడి ధనరాజు తెలిపారు. ఆదివారం ధర్మవరంలో గ్రామపెద్ద ముళ్ళపూడి కాశి, జాలాది రవికుమార్ చేతుల మీదుగా ఎనిమిది పేద కుటుంబాలకు రూ.7,500 నగదు వైద్యా ఖర్చుల నిమిత్త అందించారు. ఈ కార్యక్రమంలో తానేటి రమేష్, దసిక దాసు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాడలో భారీ అగ్నిప్రమాదం

రూ.లక్షల విలువైన వలలు, 3 బైకులు దగ్ధం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఉప్పాడ గ్రామం నాయకర్ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.లక్షల విలువైన వలలు, మూడు బైకులు దగ్ధమయ్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం ఉప్పాడ గ్రామానికి చెందిన మైలిపల్లి అప్పారావు రేకుల షెడ్డులో కొందరు మత్స్యకారులు చేపల వలలు స్టోర్ చేస్తుంటారు. అదే ప్రదేశంలో కొందరు బైకులు కూడా అక్కడే నిలుపుదల చేస్తూ ఉంటారు. ఆదివారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగి రేకుల షెడ్డులో ఉన్న వలలు, మూడు బైకులు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు రావడంతో గమనించిన స్థానిక మత్స్యకారులు పిఠాపురం అగ్నిమాపక సిబ్బందికి, స్థానిక సర్పంచ్‌కు సమాచారం అందచేయడంతో హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే బైకులు, వలలు మంటల్లో కాలి బూడిద అయ్యాయి. ప్రమాదం షార్ట్ సర్క్యూట్ మరి ఏదైనా కారణమా వల్ల జరిగిందా అనే కోణాల్లో అగ్నిమాపకసిబ్బంది దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు గారూ.14లక్షల పైబడినష్టం వాటిల్లినట్లు స్థానిక మత్స్యకారులు తెలుపుతున్నారు

కాలి బూడిదైన వలలు, ద్విచక్ర వాహనాలు

బాధితులకు ఎంఎల్ఎ దొరబాబు పరామర్శ

అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. వలలు, బైకులు అగ్నికి ఆహుతి అవడంతో మత్స్యకార మహిళలు కంటతడి పెట్టుకోవడంతో స్పందించిన ఎంఎల్ఎ ప్రభుత్వంద్వారా రావాల్సిన సహకారంఅందిస్తామని మత్స్యకారులకు హామీ ఇచ్చారు.

బాధితులకు 'జనసేన' ఆర్థిక సాయం

పలివెల 'జనసేన' కార్యకర్తకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో వేర్వేరుచోట్ల జరిగిన ప్రమాద ఘటనల్లో గాయపడిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీతరపున ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. వివరాలు ఇవి..

కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త గంట్రోతు మనోహర్ ఇటీవలే ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందాడు. అయితే వైద్యం నిమిత్తం అయిన ఖర్చును పవన్ కళ్యాణ్ తరపున పార్టీ మెడికల్ ఇన్సూరెన్స్ నుండి రూ.50వేల చెక్కును జనసేనపార్టీ నియోజకవర్గం ఇంఛార్జ్ బండారు శ్రీనివాస్ అందించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి బొక్కా ఆదినారాయణ, మండల అధ్యక్షులు కంఠంశెట్టి సత్యప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఎన్ఎన్.మూర్తి, తుల రాజు, సప్తగిరి, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి, బాణాపురం గ్రామాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు కాళ్ళ వీరబాబు, దేవు వీరబాబులు ప్రమాదంలో గాయపడి ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందారు. వీరికి రాష్ట్ర జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ పంపిన రూ.50వేల చెక్కులను పంపారు. రాయపురెడ్డి బాబి, నరాలశెట్టి రాంబాబు, లంకెలపల్లి జమ్మి,దేవు రాంబాబు, మల్లిపూడి రాజా, సలాది రాజా సమక్షంలో జనసేన పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గం ఇంచార్జ్ పితాని బాలకష్ణ బాధితులకు అందజేశారని మండల పార్టీ అధ్యక్షులు మద్దింశెట్టి పురుషోత్తం ఆదివారం విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో పితాని రామ కష్ణ, రాజు, సవరపు వెంకట్, అప్పాడి బాబ్జి, కొర్లపాటి సాయికిరణ్, వాసంశెట్టి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

టి.కొత్తపల్లిలో బాధితులకు చెక్కులు అందిస్తున్న దృశ్యం

చంటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చంటి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

కిత్తన చెరువుకు చెందిన వైసిపి నాయకుడు బళ్ల చంటి ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. మృతుని కుటుంబాన్ని ఆదివారం పలువురు నాయకులు పరామర్శించారు. చంటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో సామాజికవేత్త పచ్చిమాల బాబ్జి, వైసిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు పోతుమూడి కొండబాబు, సచివాలయాల మండల కన్వీనర్ కోటుం లోవరాజు, వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు ఓగూరి విజయకుమార్, సొసైటీ ఛైర్మన్ ఊటాల రామాంజనేయులు, తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా చేతిపంపు

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ భవనం వద్ద ఉన్న చేతి పంపు మరమ్మతులకు గురై సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు నేటికీ పట్టించుకోలేదు. ఇటీవల కాలంలో వేరువేరుగా మరుగుదొడ్లు నిర్మించి చేతిపంపు వద్ద ఉన్న మోటారును వాటర్ ట్యాంక్ వినియోగించి , కుళాయి సౌకర్యం కల్పించడంతో ఈ చేతి పంపును పట్టించుకోలేని నాథుడే కరువయ్యారు. విద్యాశాఖ కార్యాలయంలో సమావేశాలు, నిర్వహించేటప్పుడు, సామూహిక భోజనం కార్యక్రమాలు ఏర్పాటు చేసినప్పుడు, తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడే సందర్భాలు ఏర్పడుతున్నాయి. మరుగుదొడ్డిలో ఉన్న కుళాయిలను వినియోగించడానికి ఇష్టపడని వారు ఈ చేతి పంపునే వినియోగించేవారు. ఈ చేతి పంపు కూడా పనిచేయకపోవడంతో తాగడానికి నీళ్లు లేక అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులకు గురైన చేతి పంపును వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

మరమ్మతులు గురై వినియోగంలో లేని చేతి పంపు

యానాం వార్తలు

ఉపకార వేతనానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ప్రజాశక్తి- యానాం

యానాం ప్రాంతానికి చెందిన ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు 2023-24 విద్యాసంవత్సరంలో ఉపకార వేతనం కోసం నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని ఆది ద్రావిడశాఖ ఎడి రేకాడి కృష్ణమూర్తి తెలిపారు. ఉపకార వేతనం ఖాతాల్లోకి బదలాయింపు కోసం నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇకెవైసిలతో ఆధార్‌ను అనుసంధానం చేయించుకోవాలని తెలిపారు. నవంబరు 30లోగా దరఖాస్తులు పంపించాలని తెలిపారు.

ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -ప్రత్తిపాడు

ప్రత్తిపాడులోని జెడ్‌పి హైస్కూల్లో నిర్వహించిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఎపిటిఎఫ్ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా ఎన్.ఫిలిప్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎన్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జి.చంద్రశేఖర్, జి.దుర్గాప్రసాద్, డి.ఎ.రాజశేఖర్, కార్యదర్శులుగా బి.సురేష్, బి.సత్యప్రసాద్, కెఎస్.సుబ్రహ్మణ్యం, శ్రీరాం, లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ సిపిఎస్ విధానం రద్దు చేస్తామని మాట ఇచ్చి జిపిఎస్ తీసుకురావడం సరికాదన్నారు. తక్షణమే పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలను కునారిల్లింపజేస్తున్న జిఒ 117ను రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు చెల్లించవలసిన డిఎ ఎరియర్స్, డిఎలు తక్షణమే విడుదల చేయాలన్నారు. పిఎఫ్, ఎపిజిఎల్ఐ, ఎర్న్‌డ్ బకాయిలు విడుదల చేయాలని, విభిన్న మేనేజ్మెంట్ల సమస్యలను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

10 వేల మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు 20 వరకూ నిర్వహించి సుమారు 10 వేల మంది ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి.ప్రశాంత్ చెప్పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శనివారంతో మండల పరిధిలో 20 సురక్ష శిబిరాలు నిర్వహించి సుమారు 23 మందిని అత్యవసర వైద్యం కోసం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి రిఫర్ చేసామన్నారు. వీరిలో అధికంగా గుండె సంబంధిత సమస్యలున్నట్లు చెప్పారు. రూ.10 లక్షల వరకూ ఆరోగ్య కిట్లు, మందులు ప్రజలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. స్త్రీలు గైనకాలజిస్టు సేవలను శిబిరాల్లో సద్వినియోగం చేసుకున్నట్లు చెప్పారు. ఈ శిబిరాల్లో వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ హిమవతి, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ భవ్యశ్రీ, వైద్య ఆరోగ్య సిబ్బంది సేవలందించినట్లు వివరించారు.

శిథిలావస్థకు రక్షిత నీటి పథకాలు

పొంచి ఉన్న ప్రమాదం, పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలం లోని పలు గ్రామాల్లో గతంలో నిర్మించిన రక్షిత నీటి పథకాలు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్నాయి. కోరుమిల్లి, కపిలేశ్వరపురం, వాకతిప్ప గ్రామాల్లో గతంలో ఏర్పాటు చేసిన ఈ వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి .వాకతిప్ప గ్రామంలో ఉన్న ట్యాంకు మాత్రమే తాగునీరు వినియోగిస్తున్నారు. కేవలం 30 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ఈ వాటర్ ట్యాంక్ నాటి కాలపు నిర్మాణ శైలిలో నలుపలకలగా ఉన్నాయి. ఈ వాటర్ ట్యాంక్ లీకేజ్ సమస్య ఉన్నా, సామర్థ్య సరిపోకపోయినా తప్పని పరిస్థితుల్లో తాగునీటి కోసం వినియోగిస్తున్నారు. ప్రతినిత్యం రెండు మూడు దఫాలుగా నీటి సరఫరా చేయడానికి పంచాయతీ ఉద్యోగులు శ్రమిస్తున్నారు. కపిలేశ్వరపురం లో పంచాయితీ వెనుక భాగంలో వినియోగంలో ఉన్న భారీ నీటి ట్యాంకు సమీపంలో నిరుపయోగంగా పాతకాలపు వాటర్ ట్యాంక్ కొబ్బరి చెట్టు అంతఎత్తులో ప్రమాదకరంగా ఉంది .ఏ సమయంలోనైనా ప్రమాదం జరిగితే పక్కన వినియోగంలో ఉన్న నీటి ట్యాంకు పై పడే ప్రమాదం ఉంటుందని, స్థానికంగా ఇళ్లు ఉన్నాయని, పలువురు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు .కోరుమిల్లి ప్రధాన కూడలి లో వినియోగంలో లేని వాటర్ ట్యాంక్ శిథిలమై శ్లాబ్ కుంగి కూలడానికి సిద్ధంగా ఉంది. ప్రతినిత్యం జనం తిరిగే ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆ ప్రాంత స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ ట్యాంకులను తొలగించడానికి అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి నిరుపయోగంగా ఉండి కూలడానికి సిద్ధంగా ఉన్న ఈ వాటర్ ట్యాంక్ లను తొలగించే నిర్ణయం తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కోరుమిల్లిలో వినియోగంలో లేని వాటర్ ట్యాంక్

అపరిశుభ్రంగా 'గాంధీనగర్'

పేరుకుపోతున్న చెత్తతో ఇక్కట్లు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం మండలంలోని తోటపేట పంచాయతీ పరిధిలో గల గాంధీనగర్లో తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. ఎక్కడ డంపింగ్ యార్డ్ లేకపోవడంతో చెత్తాచెదారం మిగిలిపోయిన ఆహార పదార్థాలు, వ్యర్థాలు రోడ్డు పక్కన వేయడంతో తీవ్ర దుర్వాసన ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్తులు అంటున్నారు. ఎక్కడ చెత్తాచెదారం పేరుకు పోవడంతో దోమలు ఈగలు పెరిగిపోయి పరిసర ప్రాంతాల ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రభుత్వం స్వచ్ఛత మన బాధ్యత అంటూ పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని చెత్తాచెదారాన్ని దూర ప్రాంతాలకు తరలించాలని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అవి అమలు కావడం లేదని పలువురు చెబుతున్నారు. తోటపేట పంచాయతీలోని దళితవాడను ఆనుకునే ఉన్న ఈ చెత్తాచెదాలన్ని తొలగించాలని చర్యలు చేపట్టాలని, దుర్వాసన వెద జల్లకుండా బ్లీచింగ్ జల్లించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

గాంధీ నగర్‌లో పేరుకుపోయిన చెత్త చెదారం

CHANGE OF NAME

I, KOTLA VAMSI KRISHNA, S/o. Veera Raghavulu Kotla, Resident of D.No.12-9-19, Kotla Vari Street, Kovvur (Village & Mandal), East Godavari-534350. I was mentioned My Father Name as **VEERARANGHAVULU KOTLA (Old Name)** instead name as **VEERARAGHAVULU KOTLA (New Name).** So by this notice we are informing all the general public.